# ముసురుకుంది

- జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేని వాన
- మిగ్‌జాం తుఫాన్‌తో చల్లబడిన వాతావరణం
- నల్లగొండ, యాదాద్రి జిల్లాలకు ఎల్లో అలర్ట్.. సూర్యాపేటకు ఆరెంజ్ అలర్ట్
- పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం
- మరో రెండు రోజులు కొనసాగనున్న తుఫాన్


నల్లగొండ పట్టణం హైదరాబాద్ రోడ్డుపై కురుస్తున్న చిరు జల్లులు

నీలగిరి, డిసెంబర్ 4: బంగాళాఖాతంలో ఏర్పడిన మిగ్‌జాం తుఫాన్ ప్రభావంతో జిల్లాలో ఎడతెరపి లేకుండా ముసురు కురుస్తున్నది. సోమవారం సాయంత్రం చిరుజల్లులతో ప్రారంభమైమంగళవారం రోజంతా మోస్తరు వర్షం కురిసింది. దాంతో ఉష్ణోగ్రత 19 డిగ్రీల కనిష్టానికి పడిపోయింది. ఉదయం నుంచి చలిగాలులు వీస్తుడడంతో చలి తీవ్రత పెరిగినందున పిల్లలు, వృద్ధులు ఇబ్బంది పడి ఇంట్లో నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు.

## జిల్లాలో వర్షపాతం నమోదు ఇలా..

జిల్లాలో ఒక్కరోజే 202.2 మిల్లీ మీటర్ల వర్షం కురవగా సగటున 6.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా దామరచర్ల 18.2, అడవిదేవులపల్లిలో 16.4, చందంపేటలో 15.3 త్రిపురారంలో 14.1, మిర్యాలగూడలో 13.9, తిరమలగిరి(సాగర్)లో 10.6, పెద్ద అడిశర్లపల్లిలో 8.9, వేములపల్లిలో 8.2, మునుగోడులో 8.1, పెద్దవూరలో 7.4, అనుములలో 7.3, చండూర్‌లో 7.2, కొండమల్లేపల్లిలో6.7, గుర్రంపోడ్‌లో 5.4, నిడుమనూర్‌లో 5.4, మర్రిగూడలో4.8, నేరేడుగొమ్ములో4.2, తిప్పర్తిలో4.1, మాడ్గులపల్లిలో 4.1, గట్టుప్పల్‌లో4.0, నల్లగొండలో3.8, నకిరేకల్‌లో 3.8, కనగల్‌లో 3.5 చిట్యాలలో 3.4, గుండ్లపల్లిలో3.3, కేతేపల్లిలో 2.9,నాంపల్లిలో 2.4, శాలిగౌరారంలో 2.1, నార్కట్‌పల్లిలో 2.1, చింతపల్లిలో 1.8, కట్టంగూర్‌లో 1.1, దేవరకొండలో 0.6 మీల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది.

## సూర్యాపేట ఆరెంజ్.. నల్లగొండకు ఎల్లో జోన్‌గా అలర్టు

తుఫాన్ ప్రభావంతో మరో రెండ్రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ అధికారులు తెలిపారు. ఈక్రమంలో వాతావరణ శాఖ సూర్యాపేట జిల్లాను ఆరెంజ్, నల్లగొండ జిల్లాను ఎల్లో జోన్‌గా ప్రకటించారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర ప్రయాణాలు మాత్రమే చేసుకోవాలని, సాధ్యమైనంత వరకు ఇంటి నుంచి బయటకు రావద్దని సూచనలు చేశారు.

## నకిరేకల్‌లో మోస్తరు వర్షం

కట్టంగూర్: తుఫాన్ ప్రభావంతో నియోజకవర్గంలో మోస్తరు వర్షం కురుస్తున్నది. రామన్నపేట, చిట్యాల, నార్కట్‌పల్లి, కట్టంగూర్, నకిరేకల్, కేతేపల్లి మండలంలో సోమవారం అర్ధరాత్రి నుంచి చిరుజల్లులు కురుస్తున్నాయి. ఈదురు గాలులు వీస్తుండడంతో ప్రజలు చలికి వణికిపోతున్నారు. విద్యుత్ అధికారులతో పాటు మండల స్థాయి అధికారులు గ్రామాల్లో అందుబాటులో ఉండాలని ఆయా మండలాల తాసీల్దార్లు ఆదేశించారు.


నల్లగొండ వీటీ కాలనీలో..

## శాలిగౌరారంలో ముసురు..

శాలిగౌరారం : మండల వ్యాప్తంగా మోస్తరు వాన కురిసింది. చల్లని గాలులతో ప్రజలు వణుకుతున్నారు. రైతులు మాత్రం తమ ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో అమ్మకానికి తెచ్చిన ధాన్యం తడవకుండా టార్ఫాలిన్లతో కప్పి జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రజలు బయటికి వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## మిర్యాలగూడలో

మిర్యాలగూడ : నియోజక వర్గం వ్యాప్తంగా సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఆసాంతం ముసురు కురిసింది. వర్షానికి తోడు గాలులు వీస్తుండడంతో వాతావరణం చల్లబడింది. దాంతో ప్రజలు ఇండ్ల నుంచి బయటకి రావడానికి జంకుతున్నారు. ఇటీవల వానకాలం సాగు చేసిన వరి పంట చేతికి రావడంలో రైతులు యాసంగి దుక్కులు సిద్ధం చేసుకొంటున్నారు. ఈ సారి సాగర్ కాల్వకు నీరు విడుదల కాక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్న తరుణంలో వర్షం కురుస్తుండడంతో రైతులు ఉత్సాహంగా దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులు నాట్లు పెడుతున్నారు. పత్తి, మిర్చి పంటలతోపాటు, ఇంకను చేతికి రాని వరి పంటలకు వర్షంతో కొంత నష్టాన్ని కలిగించింది.

- హాలియా/ నిడమనూరు : నాగార్జున సాగర్ నియోజకవర్గంలో సోమవారం అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేని వర్షం కురుస్తుంది. దీంతో జనజీవనం స్తంభించింది. రోడ్లన్నీ బురదమయంగా మారాయి. డ్రైయినేజీ కాల్వల్లో నీళ్లు పొంగిపోర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు వచ్చి చేరింది.

యాసంగి వరి నాట్లకు సిద్ధమవుతతున్న రైతులకు మేలు చేయగా వానకాలంలో వరి నాట్లు ఆలస్యంగా వేసి ఇప్పుడే వరి కోతలు కోస్తున్న రైతులను వర్షం ఇబ్బందులకు గురిచేసింది. వర్షం కారణంగా పాఠశాలల్లో విద్యార్థుల హాజరు గణనీయంగా తగ్గింది.

# రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలి

- కలెక్టర్ ఆర్ వీకర్ణన్
- యాసంగి సాగుపై అధికారులతో సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్ వీ కర్ణన్

నీలగిరి, డిసెంబర్ 5 : యాసంగిలో పంటల సాగు ప్రణాళిక ప్రకారం రైతులకు ఎరువులు, పురుగు మందులు, నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం యాసంగిలో పంటల సాగు ప్రణాళిక, ధాన్యం కొనుగోళ్లపై వ్యవసాయ, పౌరసరఫరాల, జిల్లా గ్రామీణాభివృద్ధి, సహకారశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి సమీక్షించారు. యాసంగిలో జిల్లాలో 4,80,000 ఎకరాల్లో సాగు అంచనా వేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. యాసంగి పంటల సాగు ప్రణాళికను అనుసరించి రైతులకు కావాల్సిన రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందేలా వ్యవసాయ శాఖ చర్యలు తీసుకోవాలని అన్నారు. లక్ష ఎకరాల్లో వరినారు వేసినట్లు, 4 వేల ఎకరాలు వరి సాగు, 4 వేల ఎకరాలు వేరుఃనగ సాగుచేసినట్లు అధికారులు వివరించారు. ప్రణాళిక ప్రకారం 71 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా 24 వేల యూరియా స్టాక్ నిల్వలు అందుబాటులో ఉండగా 7 వేల మెట్రిక్ టన్నులు మండలంలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రైతులు సన్న, దొడ్డు రకం యూరియా ఒకే విధంగా పనిచేస్తాయని వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఉద్యాన అధికారులు లక్ష్య ం మేరకు ఆయిల్‌ఫాం సాగుకు రైతులను ప్రొత్సహించాలని సూచించారు.అకాల వర్షాలు కురుస్తున్నందున ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా పూర్తికావాలని సూచించారు. వెంటనే ట్యాబ్ ఎంట్రీ పూర్తిచేయాలని, కేంద్రాల్లో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పాలని ఆదేశించారు. జిల్లాలో 242 కొనుగోలు కేంద్రాల ద్వారా ఐకేపీ 98, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్) 133, రైతు ఉత్పత్తి సంఘాలు(ఎఫ్‌పీఏ) 11 కేంద్రాల ద్వారా 3,01,700 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసి 583 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. జిల్లాలో 154 కొనుగోలు కేంద్రాలు ఐకెపి 74, పీఏసీఎస్79, ఎఫ్‌పీఏ 8 కొనుగోలు కేంద్రాలు కొనుగోళ్లు పూర్తిచేసినందున క్లోజ్ చేసినట్లు అధికారులు వివరించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం త్వరితగతిన కొనుగోలు పూర్తి చేయాలని, కొనుగోలు చేసిన ధాన్య ట్యాబ్ ఎంట్రీలు పూర్తి చేసి రైతులకు త్వరగా చెల్లింపులు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఏఓ శ్రావణ్, ఉద్యానశాఖ అధికారి సంగీతలక్ష్మి, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, పౌరసరఫరాల డీఎం నాగేశ్వరరావు, డీసీఓ కిరణ్‌కుమార్‌పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులు


హాలియాలో కురుస్తున్న వర్షం


మిర్యాలగూడ రూరల్ : ఊట్లపల్లిలో వర్షంలో వరి నాటేస్తున్న కూలీలు


నకిరేకల్ పట్టణంలో వర్షం


శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో వర్షానికి ధాన్యం రాశులపై కప్పిన టార్ఫాలిన్లు


అడివిదేవులపల్లిలో..


మాడ్గులపల్లి ప్రధాన రహదారిపై కురుస్తున్న వాన